# కలకంఠి కంట కన్నీరొలికిన..

ఇంటి తగూల్ని ఇందిరాగాంధి కూడా తీర్చలేదనీ మావా రంటారు. పిల్లల తగూల్ని ప్రెసిడెంటాఫిండియా కూడా తీర్చలేరని నేనం టాను. తగూల్లేని సంసారం ఏదైనా వుంటే అక్కడికి మనం పనివేళా వెళ్ళి పిల్లి తగూవో, పిచిక తగూవో పెట్టి ఆనందించి రావాలి. ఎవరేనా పోట్లాడుకున్నా పోట్లాట వలన ఇరుగు పొరుక్కి కొంత వినోదం తప్పక లభ్యమవుతుంది గనుక చిన్న చిలిపి తగూలు జీవితంలో డల్‌నెస్‌ను పోగొట్టి సంఘర్షణను పెంచుతాయి.

తగూలవలన లాభమేగాని నష్టలేదంటాను. ఎవరెవరి స్వభావా లెలాటివో స్పష్టంగా తెలిసిపోతాయి. తగూవలన ఒక మర్యాదపు పొర కాస్త చిరిగిపోయి లోపలి మనిషి వాసన బయటికి తెలుస్తుంది. గట్టిగా పోట్లాడుకోవటం వలన మనం ఏడవాలిసి రావచ్చు. కలకంఠి కంట కన్నీ రొలికిన సిరి యింటనుండి నొల్లదు అని సుమతీ శతకం వాడు అన్నా మనం ఖాతరు చేయక్కర్లేదు. ఏడ్చినపుడు మాత్రం ఒక అద్దుడు కాయి తమో, రుమాలో పుచ్చుకుని మనకి మనం తుడిచేసుకుంటే సరిపో తుంది.

కలకంఠి కంటకన్నీరొలకక్కాడదు అన్నాడు కవి. ఇంట్లోంచి

బయటికెళ్ళి ఏడిస్తే పోలా—సిరి యింట నుండనొల్లదు అన్నాడు. ఇదంతా సూపర్ స్టిషన్.

అయితే ఇందులో చిన్న మిస్చీఫ్ మాత్రం వుందంటాను. అస్తమానూ పెళ్ళాన్ని ఏడిపిస్తూ ఇంట్లో కూర్చుంటే వెధవా అవతల ఆఫీసు పన్లూ వగైరా పాడై పోతాయి. అప్పుడు ఏడుస్తూన్న పెళ్ళాం యెదురుగుండా ఏడిపిస్తూ కూర్చుంటే — అవతల ఆ ఆడది ఏడుస్తూ వుంటుందా వంటా వార్పు పనీగట్రా చూసుకుంటుందా-హోంశాఖ తల్లక్రిందులై పోతే



ఘట్టోపడ్డ అవస్థలో పడతావ్ —కుదేలై పోతే 'సిరి యింటనుండ నొల్లదు' అనగా వెధవాయీ రిస్టు వాచీలు, వెండి గిన్నెలు, సైకిళ్ళూ, చెంబూ తప్పాలా తాకట్టుపెట్టి తినెయ్యాలి సొస్తుందిరా చవటా అని ఈ పద్యం తాత్పర్యం.

పెళ్ళాన్ని రోజూ ఉతికేసి ఇస్త్రీచేసే మొగానాయళ్ళ కోసం వాళ్లని పెట్టడానికి రాసిన పద్యం ఇది. తాగేసొచ్చి రోజూ నాలుగు తగలనిచ్చి తెలివొచ్చాక ముద్దులెట్టేసుకునే బాపతు సరుక్కి- ఈ పద్యం చెప్పి లాభం

వుండదు. ఆడది కంటకడి పెట్టుకోకుండా వుండేలా మగవాడు నడుచు కుందుకు ఏంచేయాలి ?

మావారు మార్క్సిస్టు మిత్రుడ్ని అడిగితే "లాభంలేదోయ్ బ్రదరూ-రాజ్యాంగం మనుస్మృతి తగలబెట్టాలన్నాడు. మార్క్సిస్టు – లెనినిస్టు అండర్ గ్రవుండు మిత్రుడ్ని కదిపితే–"కలకంఠీలేదు, కలకంఠుడూలేదు. ఈ బూర్జువా ప్రజాస్వామిక వ్యవస్థను కూకటి వేళ్లతో పెల్లగించాలి. ఈ వ్యవస్థ మారనిదే లాభంలేదు. నువ్వూ మీ ఆవిడా సాయుధ పోరాటంలో చేరండి, ఆయుధాలు ధరించి పెట్టుబడిదారీ పాలకవర్గాన్ని కూలద్రోయండి అన్నాడు. మా వారు హడ్డిలిపోయి తెల్ల కమ్యూనిస్టు స్నేహితుడ్ని పిలిచి అడిగారు కలకంఠి కంట కన్నీరొలికిన....అన్న పద్యం చదివి కన్నీరొలక గుండా వుండాలంటే ఏం చేయాలని.

పార్లమెంటు ప్రజాస్వామ్య విధానాల ద్వారానే దీనికి పరిష్కారం వుంది. సోషలిజం కూడా ఇందిరాగాంధీ చేతులమీదుగా రావలసిందే-ఆవిడ సమర్థురాలు. కలకంఠి కంట కన్నీరొలక్కుండా చేయలేని పక్షంలో మాతో చెప్పండి-ఆవిడ సంగతి కనుక్కుంటాం. పార్లమెంటు ద్వారా ప్రజలకు అన్యాయం జరగాలి కాని మరో మహోద్వారా జరగడానికి వీల్లేదు అని గట్టిగా చెప్పారు.

సర్లెండి అని ఒక జనసంఘీయుడ్ని కలిసి ఆడవాళ్ల ఏడుపుని తగ్గించేందుకు ఏం చేయాలి అని ప్రశ్నించారు.

మైనారిటీల రక్షణపేరిట హిందువుల్ని దోచి హిందువేతర వర్గాల్ని బలపరుస్తున్నారు. సెక్యులరిజం అని చెప్పి క్రైస్తవుల్ని, ముసల్మానుల్ని నెత్తి కెక్కించుకుంటున్నారు. హిందూ దేశం హిందువులది, ఈ విషయం అంగీకరిస్తే–తరువాత మీ కన్నీటి విషయం గురించి ఆలోచిస్తామన్నారు. హిందువులకే ఫామిలీ ప్లానింగ్ కాని కేతొలిక్కులకు మహమ్మదీయులకు పెట్టలేదు. ఒక యాభయి సంవత్సరాల్లో హిందూ దేశంలో హిందువులు లేకుండా ఇతర మైనారిటీ మతాలవారు మెజారిటీ అవుతారు. యిది మా ఏడుపు–వెళ్ళండి అన్నారు వారు చిరాగ్గా.

"డి. యం. కె. వారి నడుగ్గా" అయ్యా - బ్రాహ్మిన్నాన్బ్రాహ్మిన్ సమస్య తేలందే ఏ సమస్యా తేలదుకాక తేలదన్నారు వారు.

అప్పుడు కొందరు పెద్దలనిపించుకునేవారు. మా వారిని పిలిచి రూలింగుపార్టీ కొత్త కాంగ్రెసు వుండగా అడ్డమైన పార్టీలను యెందు కడుగుతావయ్యా వెళ్ళి ఇందిరాగాంధీ కాళ్లమీద పడు అని కూక లేశారు.

అప్పుడు నేను శ్రీవారికి గీతాభాష్యం చెప్పాను. ఆవూ దూడా రెండూ పేడేవేస్తాయి గనుక కొంచెం ఆగాల్సిందేనని చెవిలో చెప్పాను. ఆముదం దీపం మట్టి ప్రమీదలూ మనకి పనికి రావని గట్టిగా ఎదురుగాలి వీస్తే ఆరిపోతాయని కూడా చెప్పాను.

ఉదయించే సూర్యుడ్ని కూడా దట్టంగా మబ్బులు కమ్మేస్తాయి. కావా అన్నాను. అవునన్నారు. కొడవలీ సుత్తీ, కొడవలీ పళ్ళ చక్రం, లేదా కొడవలీ సుత్తీ నక్షత్రం అన్నీ కూడా తుప్పుబట్టి పోయున్నాయి. గనుక కన్నీరొలక్కుండా జాగ్రత్త పడాలంటే కలకంఠిని కళ్ళుమూసుకుని బోర్ల పడుకోమనాల్సిందేనన్నాను. ఎగ్జాట్లీ – ఇవ్వుడాపనేగా చేస్తున్నది అన్నారు మా యంగ్‌మాన్.

ఇంతలో మా యింటికొచ్చిన ఓ పాఠకీమణిగారూ, ఒక పాఠకీ మణుడుగారూ చాలా వినయంగా ఎవరండీ ఈ కలకంఠి కలకంఠి అని మమ్మల్ని వాపజాదేస్తున్నారు. ఇందాట్నుంచీ అనిఅడిగారు కుతూహలంగా.

భరతమాత అన్నారు మావారు.

తప్పు 'భా'కుఒత్తుండాలి అన్నారు పాఠకుడుగారు. ఒత్తులు వంకర్లు పోతే మట్టుకు బావం సరిగా వుంటే చాలదా అని పాఠకీమణి అన్నారు నవ్వుతూ. బావం కాదండీ భావం అన్నానేన్నేను. పోన్లెస్తురూ - ఇది ప్రజా యుగం. కళల్నీ రాజకీయాల్నీ ప్రజల దగ్గరకు తెస్తున్నప్పుడు ఒత్తుల్తో సహా తేవాలని ఎక్కడుంది అన్నారు మావారు.

భర్తల మాట భార్యలు వినాలికదా అంది పాఠకీమణి. అయ్యో "భర్తలండీ-భార్యలు. భర్తకి భార్యకి ఒత్తులుండాల్సిందే" అన్నాడు పాఠకుడుగారు.

"ఈసారి రెండొత్తులు పోయాయి" అని నవ్వేస్నేను. "మరి మాట్లాడకండి—మాట్లాడితే అనవసరంగా ఒత్తులు జారిపోతాయి" అన్నాడు పాఠకుడుగారు. మావారు గంభీరంగా మొగంపెట్టి "రేడియో స్టేషన్‌కి వెళ్ళేదారిలో వక్తలు పారేసుకున్న ఒత్తులు బోల్డు దొరుకుతాయి" అని చమత్కరించారు. కలకంఠి కన్నీరొలగ్గా లేంది. అక్షరాలకు ఒత్తులు జారి పోతే తప్పా? నాన్సెన్స్!